## విలేకరులు కావలెను

హిందుస్థాన్ మీడియా తెలుగు దినపత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ రాష్ట్రాలలో జిల్లా రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జులు, మండలాలవారిగా విలేకరులు కావలెను. అనుభవం కలవారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

సంప్రదించండి 9000306455



epaper.hindusthanmedia.com APTEL / 2004 / 19136

# హిందుస్థాన్ మీడియా

తెలుగు దినపత్రిక సామాన్యుడి నేస్తం








ఎడిటర్ : తాడెం. ప్రశాంత్ సిద్దిపేట సంపుటి : 1 సంచిక : 88 బుధవారం జూలై 29 2026, పేజీలు - 4 వెల :2/-


# అత్యాధునిక సాంకేతిక పరిశ్రమలకు తెలంగాణ అనువైన గమ్యం: సీఎం రేవంత్ రెడ్డి





-స్కైరూట్ ఏరోస్పేస్ వ్యవస్థాపకులను అభినందించిన సీఎం..

-ఏరోస్పేస్, స్పేస్ టెక్నాలజీ అభివృద్ధిపై చర్చ

హిందుస్థాన్ మీడియా

అత్యాధునిక సాంకేతిక పరిశ్రమలు, స్టార్టప్‌ల ఏర్పాటుకు తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలా అనుకూల వాతావరణాన్ని కల్పిస్తోందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలిపారు. స్కైరూట్ ఏరోస్పేస్ సహ వ్యవస్థాపకుడు, సీఈఓ పవన్ కుమార్ చందన, సహ వ్యవస్థాపకుడు, సీఓఓ నాగ భరత్ డాకా ఢిల్లీలో ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా భారతదేశంలోనే ప్రైవేటు రంగం అభివృద్ధి చేసిన తొలి ఆర్బిటల్-క్లాస్ ప్రయోగ వాహనం విక్రమ్-1 విజయవంతమైన ప్రయోగం గురించి వారు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ విజయంతో అమెరికా, చైనా తర్వాత ప్రైవేటు రంగం ద్వారా ఆర్బిటల్ ప్రయోగ సామర్థ్యాన్ని సాధించిన ప్రపంచంలోని మూడో దేశంగా భారత్ నిలిచిందని తెలిపారు. సమావేశంలో తెలంగాణలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఏరోస్పేస్, అంతరిక్ష సాంకేతిక రంగాల పురోగతి, ఆవిష్కరణలు, అధునాతన తయారీ, పరిశోధన-అభివృద్ధి (ఆర్అండ్‌డీ), ప్రభుత్వం--ప్రైవేటు అంతరిక్ష పరిశ్రమల మధ్య భాగస్వామ్య అవకాశాలపై చర్చించారు. ఈ సందర్భంగా స్కైరూట్ ఏరోస్పేస్ వ్యవస్థాపకులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. వారి విజయం భారత అంతరిక్ష రంగ ప్రతిష్ఠను అంతర్జాతీయ స్థాయిలో మరింత పెంచుతుందని, తెలంగాణ కూడా ఈ రంగంలో పెట్టుబడులు, పరిశోధనలకు ఉత్తమ కేంద్రంగా ఎదుగుతుందని పేర్కొన్నారు.

# తెలంగాణకు 11.56 లక్షల పీఎంఏవై-జీ ఇళ్లు కేటాయించాలి





-కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి

హిందుస్థాన్ మీడియా

తెలంగాణకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన--గ్రామీణ్ కింద 11.56 లక్షల ఇళ్లను కేటాయించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కేంద్ర గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ను కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా పలువురు ఎంపీలతో కలిసి కృషి భవన్‌లో కేంద్ర మంత్రిని కలిసిన సీఎం, రాష్ట్రంలో పేదలకు సొంత ఇళ్లు నిర్మించి ఇవ్వడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. గత ప్రభుత్వం పీఎంఏవై-జీ పథకాన్ని సద్వినియోగం చేసుకోకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల కొరత తీవ్రంగా పెరిగిందని సీఎం పేర్కొన్నారు. ఆవాస్ ప్లస్ యాప్ ద్వారా నిర్వహించిన సర్వేలో 11,56,915 అర్హులైన గ్రామీణ కుటుంబాలను గుర్తించినట్లు వెల్లడిస్తూ, వీరందరికీ కేంద్రం తక్షణమే ఇళ్లను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎల్‌నినో, వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (వీబీజీ రామ్‌జీ)లో అదనపు పనులను చేర్చాలని సీఎం కోరారు. రైతులకు కూరగాయల పందిళ్లు, పశుగ్రాస ప్లాట్లు, మల్బరీ తోటలు, పట్టు పురుగుల షెడ్లు, వెదురు వనాలు, నీటి నిల్వ కందకాల నిర్మాణం, వరదలతో దెబ్బతిన్న భూముల పునరుద్ధరణ వంటి పనులను ఉపాధి హామీ పరిధిలోకి తీసుకురావాలని సూచించారు. అదేవిధంగా, ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) మాదిరిగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇంటి నిర్మాణ సమయంలో 90 రోజుల ఉపాధి కల్పించే అవకాశం కల్పించాలని కేంద్ర మంత్రిని కోరారు. సమావేశంలో తెలంగాణకు చెందిన పలువురు ఎంపీలు, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# బీబీసీ న్యూస్ తెలుగు బృందంతో మంత్రి నారా లోకేశ్ భేటీ

- ఏపీ మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన బీబీసీ బృందం
- భారత్‌లో మహిళల క్రీడలపై రూపొందించిన సర్వే వెల్లడి
- తెలుగు రాష్ట్రాల్లో బ్యాడ్మింటన్ ఆడే మహిళలు మూడింతలు పెరిగారని గుర్తింపు

-2020లో 3 శాతం ఉన్న సంఖ్య ఇప్పుడు 9 శాతానికి చేరినట్లు సర్వేలో వెల్లడి

-మహిళా క్రీడాకారులకు అన్ని విధాలా అండగా ఉంటామని లోకేశ్ హామీ



హిందుస్థాన్ మీడియా

తెలుగు రాష్ట్రాల్లో బ్యాడ్మింటన్ ఆడే మహిళల సంఖ్య గణనీయంగా పెరిగినట్లు ఓ సర్వేలో వెల్లడైంది. బీబీసీ న్యూస్ తెలుగు అసిస్టెంట్ ఎడిటర్ అనిల్ కుమార్, కలెక్టివ్ న్యూస్‌రూమ్ బృందం ఏపీ మంత్రి నారా లోకేశ్‌తో తాజాగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు భారత్‌లో మహిళల క్రీడలపై నిర్వహించిన సర్వే వివరాలను లోకేశ్‌కు అందించారు. ఈ సర్వేలోని పలు అంశాలు ఆసక్తిని రేకెత్తించాయి. ముఖ్యంగా, తెలుగు రాష్ట్రాల్లో 2020 నుంచి ఇప్పటివరకు బ్యాడ్మింటన్ ఆడే మహిళల సంఖ్య మూడింతలు పెరిగిందని సర్వేలో తేలింది. 2020లో కేవలం 3 శాతంగా ఉన్న ఈ సంఖ్య, ఇప్పుడు 9 శాతానికి చేరినట్లు బీబీసీ బృందం వివరించింది. ఈ సర్వే ఫలితాలపై మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. ఏపీలో క్రీడాకారులకు, ముఖ్యంగా యువతులకు మరిన్ని అవకాశాలు, మెరుగైన మౌలిక వసతులు, బలమైన మద్దతు వ్యవస్థలను సృష్టించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. క్రీడల్లో రాణించాలనే కల ఉన్న ప్రతి అమ్మాయికి అవకాశం కల్పించడమే తమ లక్ష్యమని లోకేశ్ తెలిపారు.

# మంత్రి పదవికి లోకేశ్ వెంటనే రాజీనామా చేయాలి

హిందుస్థాన్ మీడియా

డీఎస్సీ ఉపాధ్యాయ నియామకాల నిర్వహణలో భారీగా అక్రమాలు, కుంభకోణం జరిగాయంటూ మాజీ మంత్రి, వైసీపీ నాయకురాలు రోజా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పై నిప్పులు చెరిగారు. తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం సెకండ్ గేట్ వద్ద వైసీపీ యువజన, విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన ర్యాలీలో రోజా పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ పేరు చెప్పి నిరుద్యోగులను మోసం చేస్తూ దీనిని 'దగా డీఎస్సీ'గా మార్చేసిందని ఆమె ఆరోపించారు. జీవో 420 జారీ చేసి అర్హత లేని దాదాపు 427 మందికి అక్రమంగా పోస్టులు కట్టబెట్టారని, పరీక్షల నిర్వహణలో తీవ్ర అక్రమాలు జరిగాయని రోజా విమర్శించారు. డీఎస్సీ స్కామ్‌పై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అక్రమాలకు బాధ్యత వహిస్తూ నారా లోకేశ్ తక్షణమే తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. లోకేశ్ దిగిపోయే వరకు తమ పోరాటం ఆగేది లేదని హెచ్చరించారు. రూ. 7 వేల కోట్ల బకాయి ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయకుండా కూటమి ప్రభుత్వం విద్యార్థులు, నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటోందని రోజా ధ్వజమెత్తారు. ఇదే సమయంలో ఎమ్మెల్యే బొండా ఉమ మంత్రి పదవి కోసం లాబీయింగ్ చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం కేవలం తమ అనుకూల ప్రచార పత్రికలను కాపాడుకోవడంలో మునిగి తేలుతోందే తప్ప... మహిళల రక్షణను, నిరుద్యోగుల భవిష్యత్తును పూర్తిగా గాలికొదిలేసిందని మండిపడ్డారు. బాధితులకు న్యాయం జరిగే వరకు వైసీపీ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# పార్టీ లైన్ దాటలేదు.. దుష్టశక్తుల వల్లే వివాదం: టీడీపీ కమిటీ ముందు బోండా ఉమ వివరణ

-గుంటూరు సభ వివాదంపై టీడీపీ కమిటీకి వివరణ ఇచ్చిన బోండా ఉమ

-పార్టీ లైన్ దాటలేదని, చంద్రబాబు ఆదేశాలే శిరోధార్యమని స్పష్టీకరణ

-సోషల్ మీడియా, కొన్ని దుష్ట శక్తులు తన మాటలను వక్రీకరించాయని ఆరోపణ

-అంబటి రాంబాబుతో జరిగింది బహిరంగ పలకరింపులే, రహస్య భేటీ కాదన్న ఉమ

-భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కావని పార్టీకి హామీ

హిందుస్థాన్ మీడియా

గుంటూరులో జరిగిన ముద్రగడ పద్మనాభం సంస్మరణ కార్యక్రమంలో వైసీపీ నేత అంబటి రాంబాబుతో సమావేశం కావడంపై చెలరేగిన వివాదంపై తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు వివరణ ఇచ్చారు. దీనిపై పార్టీ అధిష్ఠానం ఏర్పాటు చేసిన విచారణ కమిటీ ముందు మంగళవారం ఆయన హాజరయ్యారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రి నిమ్మల రామానాయుడులతో కూడిన కమిటీకి తన వాదనను సమగ్రంగా వినిపించారు. తాను పార్టీ లైన్‌ను ఎప్పుడూ దాటలేదని, చంద్రబాబు ఆదేశాలను ధిక్కరించే ప్రసక్తే లేదని, చంద్రబాబు ఆదేశాలే తనకు శిరోధార్యమని ఆయన స్పష్టం చేశారు. సోషల్ మీడియాలోని కొన్ని దుష్ట శక్తులు కావాలనే తన మాటలను, అక్కడ జరిగిన సంఘటనను వక్రీకరించి దుష్ప్రచారం చేశాయని ఆయన ఆరోపించారు

**అసలేం జరిగిందంటే..**

ఈ నెల 25వ తేదీన గుంటూరులో దివంగత నేత ముద్రగడ పద్మనాభం సంస్మరణ సభ జరిగిందని, ఆ కార్యక్రమానికి కాపు జేఏసీ ఆహ్వానం మేరకు తాను వెళ్లానని బోండా ఉమా తెలిపారు. "అది పూర్తిగా రాజకీయాలకు అతీతమైన సంస్మరణ సభ. నేను ఉదయం 11 గంటలకు వెళ్లి, అక్కడ నివాళులు అర్పించి గంటలోపే, అంటే 12 గంటలకు తిరిగి వచ్చేశాను. నేను కూర్చున్న చోటుకే వైసీపీ మాజీ మంత్రి అంబటి రాంబాబు వచ్చారు. ఆయన పలకరిస్తే నేను మాట్లాడాను. ఇది రహస్యంగానో, చాటుమాటుగానో జరిగింది కాదు. మీడియా అంతా అక్కడే ఉంది. బహిరంగ వేదికపైనే ఈ సంభాషణ జరిగింది. ఆ సభకు జనసేన, బీజేపీ, టీడీపీ, వైసీపీ సహా అన్ని పార్టీల నాయకులు హాజరయ్యారు" అని ఉమా వివరించారు.

**దుష్ట శక్తుల వక్రీకరణ వల్లే వివాదం**

ఒక చిన్న విషయాన్ని పట్టుకుని, దానిని వక్రీకరించి సోషల్ మీడియాలో విపరీతంగా ట్రోల్ చేశారని బోండా ఉమా ఆవేదన వ్యక్తం చేశారు. "ఈ వివాదం వెనుక కొన్ని దుష్ట శక్తులు ఉన్నాయి. పార్టీలో గ్యాప్ తేవాలనుకునే వారు ఇలాంటి ప్రచారాలు చేస్తుంటారు. నేను అనని మాటలను కూడా అన్నట్లుగా కొన్ని టీవీ ఛానెళ్లలో ప్రసారం చేశారు. నేను ఆరోజు ఉదయం 12 గంటలకు గుంటూరు నుంచి వచ్చేస్తే, ఆ తర్వాత రోజంతా నా పేరుతో స్టేట్‌మెంట్లు ఎలా వచ్చాయి? ఇదంతా నాపై, పార్టీపై జరుగుతున్న కుట్రలో భాగమే" అని ఆయన ఆరోపించారు




**పార్టీకి, చంద్రబాబుకు ఎప్పుడూ విధేయుడినే**

తాను 25 ఏళ్లుగా తెలుగుదేశం పార్టీలో ఉన్నానని, ఏనాడూ పార్టీ గీత దాటలేదని బోండా ఉమా ఉద్ఘాటించారు. "2019 నుంచి 2024 మధ్య కాలంలో ప్రాణాలకు తెగించి పార్టీ కోసం పనిచేశాం. మాచర్ల, గుడివాడ ఘటనలైనా, టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి జరిగినా పార్టీని కాపాడుకోవడానికి ముందున్నాం. చంద్రబాబు ఆదేశాలను, ఆయన ఉద్దేశాలను ధిక్కరించే ఆలోచన నాకు కలలో కూడా రాదు, రాబోదు. ఈ విషయంపైనే కమిటీకి సమగ్రంగా వివరించాను" అని ఆయన తెలిపారు. జరిగిన సంఘటన వల్ల పార్టీకి ఏదైనా నష్టం వాటిల్లిందా అనే కోణంలో అధిష్ఠానం వివరణ కోరిందని, వాస్తవాలను వారికి తెలియజేశానని చెప్పారు. ఇది కేవలం సమన్వయ లోపం వల్లే జరిగిందని, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పూర్తి జాగ్రత్తలు తీసుకుంటానని కమిటీకి హామీ ఇచ్చినట్లు బోండా ఉమా స్పష్టం చేశారు. దీంతో ఈ వివాదానికి తెరపడినట్లయింది.

## విద్యార్థులు రోడ్డెక్కితే.. ప్రధాని ఇన్‌స్టాగ్రామ్‌లో రీల్స్ చేస్తున్నారు: లోక్‌సభలో గౌరవ్ గొగోయ్ ధ్వజం

-యాంటీ పేపర్ లీక్ బిల్లుపై లోక్‌సభలో చర్చ
-2024లో కఠిన చట్టం తీసుకొచ్చినప్పటికీ పేపర్ లీకేజీలు ఎలా
-జరుగుతున్నాయన్న గొగోయ్
-విద్యార్థులపై లాఠీఛార్జ్ కు ఎవరు ఆదేశాలు ఇచ్చారో చెప్పాలని డిమాండ్



హిందుస్థాన్ మీడియా

యాంటీ పేపర్ లీక్ బిల్లుపై లోక్‌సభలో జరిగిన చర్చ సందర్భంగా మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఓవైపు ప్రశ్నాపత్రాల లీకేజీలతో లక్షలాది మంది విద్యార్థులు వీధుల్లోకి వచ్చి ఆందోళనలు చేస్తుంటే... ప్రధాని మోదీ మాత్రం ఇన్‌స్టాగ్రామ్‌లో రీల్స్ చేసుకోవడంలో మునిగిపోయారని ఎద్దేవా చేశారు. ఇప్పటికే 2024లో కఠిన చట్టం తీసుకొచ్చినప్పటికీ పదే పదే పేపర్ లీకేజీలు ఎలా జరుగుతున్నాయని గొగోయ్ ప్రశ్నించారు. ఇప్పుడు తెస్తున్న సవరణలు కూడా ఎలాంటి పెద్ద మార్పును తేలేవని విమర్శించారు. 2024 నీట్ పేపర్ లీకేజీ సమయంలో కూడా కేంద్ర విద్యాశాఖ మంత్రిగా ధర్మేంద్ర ప్రధాన్ ఉన్నారని... అప్పుడు కూడా కుంభకోణాన్ని కప్పిపుచ్చేందుకు మంత్రి తీవ్రంగా యత్నించారని ఆరోపించారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జ్ చేయడాన్ని అమానుష చర్యగా అభివర్ణించిన ఆయన, విద్యార్థులపై దాడికి ఎవరు ఆదేశాలిచ్చారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అదే సమయంలో సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ కూడా ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ప్రధాని మోదీ ఇమేజ్ ను కాపాడేందుకే ధర్మేంద్ర ప్రధాన్‌ను మంత్రి పదవి నుంచి తప్పించారని ఆరోపించారు. వీధుల్లో పోరాడి ప్రభుత్వాన్ని దిగివచ్చేలా చేసిన యువతను ఆయన అభినందించారు. కాగా, ప్రతిపక్షాల ఆరోపణలను బీజేపీ ఎంపీ బాన్సురీ స్వరాజ్ బలంగా తిప్పికొట్టారు. 2014కు ముందు యూపీఏ పాలనలో ఏకంగా 22 సార్లు పేపర్ లీకేజీలు జరిగాయంటూ ప్రతిపక్షాల తీరును తప్పుబట్టారు.

## 'పేటీఎం పేమెంట్స్ బ్యాంక్' ఇక పూర్తిగా బంద్.. మూసివేతకు ఢిల్లీ హైకోర్టు ఆదేశాలు

-పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ లిక్విడేషన్ ప్రారంభం
-గిరికుమార్ ఎం. నాయర్ లిక్విడేటర్‌గా నియామకం
-జులై 8 నుంచే బోర్డు అధికారాల బదిలీ
-ఏప్రిల్‌లోనే లైసెన్స్ రద్దు చేసిన ఆర్‌బీఐ

హిందుస్థాన్ మీడియా,




డిపాజిటర్ల ప్రయోజనాల రక్షణే ప్రధాన కారణం పేటీఎం పేమెంట్స్ బ్యాంక్'కు అధికారికంగా ముగింపు పలికే ప్రక్రియ మొదలైంది. నిబంధనల ఉల్లంఘనలపై భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) ఇప్పటికే బ్యాంకింగ్ లైసెన్స్‌ను రద్దు చేయగా, ఇప్పుడు ఆ బ్యాంక్‌ను పూర్తిగా మూసివేసే దిశగా మరో కీలక అడుగు పడింది. ఢిల్లీ హైకోర్టు 'పేటీఎం పేమెంట్స్ బ్యాంక్'ను లిక్విడేషన్‌కు పంపాలని ఆదేశించింది. దీంతో బ్యాంక్ వ్యవహారాలన్నీ ఇక అధికారిక లిక్విడేటర్ ఆధ్వర్యంలో కొనసాగనున్నాయి. ఆర్‌బీఐ మంగళవారం విడుదల చేసిన ప్రకటన ప్రకారం.. జులై 8, జులై 22 తేదీల్లో ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల మేరకు పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌ను బ్యాంకింగ్ రెగ్యులేషన్ చట్టం-1949, కంపెనీల చట్టం-2013 నిబంధనల కింద మూసివేయాలని ఆదేశించింది. కోర్టు నిర్ణయంతో బ్యాంక్ లిక్విడేషన్ ప్రక్రియ అధికారికంగా ప్రారంభమైంది. బ్యాంక్‌కు సంబంధించిన పరిపాలనా బాధ్యతలన్నీ ఇక లిక్విడేటర్ చేతుల్లోకి వెళ్లాయి. ఈ ప్రక్రియను పర్యవేక్షించేందుకు 'స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' మాజీ చీఫ్ జనరల్ మేనేజర్ గిరికుమార్ ఎం. నాయర్‌ను అధికారిక లిక్విడేటర్‌గా హైకోర్టు నియమించింది. బ్యాంకింగ్ రెగ్యులేషన్ చట్టంతో పాటు కంపెనీల చట్టం కల్పించిన అధికారాలన్నీ ఆయన వినియోగించుకోనున్నారు. జులై 8 నుంచే పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ డైరెక్టర్ల బోర్డుకు ఉన్న అధికారాలన్నీ లిక్విడేటర్‌కు బదిలీ అయినట్లు ఆర్‌బీఐ వెల్లడించింది. పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌పై గత కొంతకాలంగా ఆర్‌బీఐ పలు నియంత్రణ చర్యలు తీసుకుంది. పదే పదే నిబంధనలను ఉల్లంఘించడం, నియంత్రణ ప్రమాణాలను పాటించకపోవడాన్ని తీవ్రంగా పరిగణించింది. డిపాజిటర్ల ప్రయోజనాలకు భంగం కలిగే విధంగా బ్యాంక్ వ్యవహారాలు సాగుతున్నాయని నిర్ధారించిన ఆర్‌బీఐ, ఈ ఏడాది ఏప్రిల్‌లో బ్యాంకింగ్ లైసెన్స్‌ను రద్దు చేసింది. అదే సమయంలో బ్యాంక్‌ను మూసివేయాలంటూ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయిస్తామని ప్రకటించింది. తాజా ఉత్తర్వులతో ఆ ప్రక్రియకు న్యాయపరమైన ముద్ర పడింది. ఇకపై పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌కు సంబంధించిన ఆస్తులు, బాధ్యతలు, చట్టపరమైన వ్యవహారాలన్నీ అధికారిక లిక్విడేటర్ పర్యవేక్షణలో సాగనున్నాయి. బ్యాంక్ మూసివేత ప్రక్రియను చట్టబద్ధంగా పూర్తి చేసే బాధ్యత కూడా ఆయనదే. ఈ పరిణామంతో పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ కార్యకలాపాలకు పూర్తిస్థాయిలో ముగింపు పలికినట్లయింది.

## బలమైన శ్రామిక వర్గ పోరాటాలే ఏసీ రెడ్డికి నిజమైన నివాళి: చుక్క రాములు






-చేర్యాలలో ఘనంగా ఏసీ రెడ్డి నరసింహారెడ్డి 35వ వర్ధంతి సభ..


హిందుస్థాన్ మీడియా, చేర్యాల:

భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తి కోసం జీవితాంతం పోరాడిన అమరజీవి, మాజీ ఎమ్మెల్యే, ఆదర్శ కమ్యూనిస్టు నాయకుడు ఏసీ రెడ్డి నరసింహారెడ్డి ఆశయాలను కొనసాగించేందుకు బలమైన శ్రామిక వర్గ, ప్రజా ఉద్యమాలను నిర్మించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు పిలుపునిచ్చారు. సీపీఎం ఆధ్వర్యంలో చేర్యాలలోని వాసవి గార్డెన్లో మంగళవారం నిర్వహించిన ఏసీ రెడ్డి నరసింహారెడ్డి 35వ వర్ధంతి సభ జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అధ్యక్షతన ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా చుక్క రాములు మాట్లాడుతూ, నైజాం పాలన, రజాకార్లు, భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా నిర్భయంగా పోరాడి పీడిత ప్రజల హక్కుల కోసం జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు ఏసీ రెడ్డి అని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు ప్రజా సమస్యలపై బలమైన ఉద్యమాలు నిర్మించడమే నిజమైన నివాళి అని అన్నారు. కేంద్రంలోని బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం కార్మిక, రైతు, పేదల హక్కులను హరిస్తూ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా విధానాలు అమలు చేస్తోందని విమర్శించారు. కార్మిక చట్టాల్లో మార్పులు, లేబర్ కోడ్‌లు, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలతో సామాన్య ప్రజలపై తీవ్ర భారం పడుతోందన్నారు. ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరిచే చర్యలు, నిరుద్యోగ సమస్య, పెరుగుతున్న పేదరికం యువత భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీల అమలులో విఫలమైందని, పేదలకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వకుండా కాలయాపన చేస్తోందని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా గ్రామ గ్రామాన ప్రజా ఉద్యమాలు చేపట్టాలని, ఏసీ రెడ్డి పోరాట స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఏసీ రెడ్డి నరసింహారెడ్డి పోరాట గీతాల సీడీని చుక్క రాములు ఆవిష్కరించారు. అనంతరం చేర్యాల రూరల్, చేర్యాల పట్టణం, కొమురవెల్లి, మద్దూరు, దూళ్మిట్ట మండలాల పార్టీ సభ్యులకు రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. 'భారత కమ్యూనిస్టు ఉద్యమ విశిష్టత' అంశంపై సీపీఎం రాష్ట్ర నాయకులు బండారు రమేష్ శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కాముని గోపాలస్వామి, రాళ్లబండి శశిధర్, శెట్టిపల్లి సత్తిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు కొంగరి వెంకటమావో, ఆలేటి యాదగిరి, బండకింది అరుణ్ కుమార్, తాడూరి రవీందర్, అత్తిని శారద, చొప్పరి రవికుమార్, జాలిగపు శిరీష, బద్దిపడగ కృష్ణారెడ్డి, చేర్యాల పట్టణ కార్యదర్శి రాళ్లబండి నాగరాజు, మద్దూరు మండల కార్యదర్శి ఎండి షఫీ, దూళ్మిట్ట మండల కార్యదర్శి పోతిరెడ్డి రాజు, చుంచనకోట సర్పంచ్ గౌర్రె శ్రీనివాస్, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు ఎస్.డి. ఇబ్రహీం, ఇప్పకాయల శోభ, నక్కల లావణ్య, పోలోజు శ్రీహర్, ఆముదాల రంజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## కృత్రిమ సూర్యుడి దిశగా చైనా.. ప్రపంచంలోనే అతిపెద్ద మాగ్నెట్ పరీక్ష విజయవంతం

-కృత్రిమ సూర్యుడి దిశగా చైనా ముందడుగు
-ప్రపంచంలోనే అతిపెద్ద ఫ్యూజన్ మాగ్నెట్‌ను విజయవంతంగా పరీక్షించిన శాస్త్రవేత్తలు
-10 కోట్ల డిగ్రీల ఉష్ణోగ్రతను నియంత్రించేందుకు ఇది కీలకం
-అణు సంలీనం ద్వారా పరిశుభ్రమైన ఇంధనాన్ని ఉత్పత్తి చేయడమే లక్ష్యం

హిందుస్థాన్ మీడియా,



అపరిమితమైన, స్వచ్ఛమైన ఇంధనాన్ని సృష్టించే లక్ష్యంతో చేపట్టిన 'కృత్రిమ సూర్యుడు' ప్రాజెక్టులో చైనా మరో కీలక మైలురాయిని అధిగమించింది. అణు సంలీన రియాక్టర్ కోసం రూపొందించిన ప్రపంచంలోనే అతిపెద్ద సూపర్ కండక్టింగ్ మాగ్నెట్‌ను చైనా శాస్త్రవేత్తలు విజయవంతంగా పరీక్షించారు. భవిష్యత్తులో ఫ్యూజన్ ఎనర్జీని సాధించే దిశగా ఇది అత్యంత కీలకమైన ఇంజినీరింగ్ విజయమని నిపుణులు అభివర్ణిస్తున్నారు. చైనీస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ పరిధిలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాస్మా ఫిజిక్స్ (ఏఎస్ఐపీపీ) శాస్త్రవేత్తలు ఈ ఘనత సాధించారు. స్వదేశీ సాంకేతికతతో అభివృద్ధి చేసిన టోరాయిడల్ ఫీల్డ్ మాగ్నెట్, హై-టెంపరేచర్ సూపర్ కండక్టింగ్ సెంట్రల్ సోలనోయిడ్ కాయిల్ వ్యవస్థలు అన్ని పరీక్షల్లోనూ ఉత్తీర్ణత సాధించినట్లు వారు ప్రకటించారు. సుమారు 582 టన్నుల బరువున్న ఈ భారీ మాగ్నెట్‌ను 'డీ' ఆకారంలో నిర్మించారు. దీని తయారీకి అవసరమైన కీలక పదార్థాల నుంచి సాంకేతిక పరిజ్ఞానం వరకు అన్నింటినీ చైనా దేశీయంగానే సమకూర్చుకోవడం విశేషం. అణు సంలీన ప్రక్రియలో భాగంగా, సూర్యుడి కేంద్ర భాగం కంటే కొన్ని రెట్లు అధిక ఉష్ణోగ్రత కలిగిన ప్లాస్మాను సృష్టిస్తారు. ఈ అత్యధిక ఉష్ణోగ్రత రియాక్టర్ గోడలను తాకకుండా, శక్తిమంతమైన అయస్కాంత క్షేత్రంలో బంధించేందుకు ఈ భారీ మాగ్నెట్‌లు కీలక పాత్ర పోషిస్తాయి. హైడ్రోజన్ ఐసోటోప్‌లను సంలీనం చేయడం ద్వారా శక్తిని ఉత్పత్తి చేసే ఈ విధానం, భవిష్యత్తులో కర్బన రహిత విద్యుత్ ఉత్పత్తికి మార్గం సుగమం చేస్తుంది. ఈ ప్రయోగం విజయవంతమైనప్పటికీ, వాణిజ్య స్థాయిలో ఫ్యూజన్ విద్యుత్‌ను నిరంతరాయంగా ఉత్పత్తి చేయడం అంతర్జాతీయ శాస్త్రవేత్తలకు ఇప్పటికీ సవాలుగానే ఉంది. అయితే, తన ఇంధన మరియు సాంకేతిక లక్ష్యాల సాధనలో భాగంగా చైనా ఈ రంగంలో భారీగా పెట్టుబడులు పెడుతూ వేగంగా ముందుకు సాగుతోందని ఈ తాజా పరిణామం స్పష్టం చేస్తోంది.

## స్వల్ప నష్టాలతో ముగిసిన స్టాక్ మార్కెట్లు.. 24,000 దిగువకు నిఫ్టీ

-69.86 పాయింట్లు తగ్గిన సెన్సెక్స్
-10.60 పాయింట్లు క్షీణించిన నిఫ్టీ
-3 శాతానికి పైగా లాభపడ్డ ఐటీ షేర్లు
-బలహీనపడ్డ ఎఫ్ఎంసీజీ, పీఎస్‌యూ బ్యాంక్ షేర్లు
-ప్రభావం చూసిప ఆసియా మార్కెట్ల బలహీనత
-వరుసగా మూడోరోజు బలపడ్డ రూపాయిద

హిందుస్థాన్ మీడియా,



దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం స్వల్ప నష్టాలతో ముగిశాయి. ఆసియా మార్కెట్లలో బలహీన ధోరణి, ఎఫ్ఎంసీజీ, పీఎస్‌యూ బ్యాంకులు, కెమికల్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి కారణంగా సూచీలు రోజంతా పరిమిత శ్రేణిలోనే కదలాడాయి. అయితే ఐటీ షేర్లలో బలమైన కొనుగోళ్లు నష్టాలను కొంత మేర తగ్గించాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 69.86 పాయింట్లు తగ్గి 76,765.92 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 10.60 పాయింట్లు క్షీణించి 23,985.35 వద్ద స్థిరపడింది. నిఫ్టీలో హిందుస్థాన్ యూనిలీవర్, భారత్ ఎలక్ట్రానిక్స్ (బీఈఎల్), కోల్ ఇండియా షేర్లు అత్యధికంగా నష్టపోయాయి. మరోవైపు ఐటీ షేర్లు మంచి ప్రదర్శన కనబరిచాయి. నిఫ్టీ ఐటీ సూచీ 3 శాతానికి పైగా ఎగసి వరుసగా మూడో రోజు లాభాల్లో ముగిసింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ 0.08 శాతం పెరగ్గా, స్మాల్‌క్యాప్ సూచీ 0.22 శాతం తగ్గింది. ఎఫ్ఎంసీజీ, పీఎస్‌యూ బ్యాంక్, కెమికల్ రంగాల షేర్లు ఒత్తిడిని ఎదుర్కొన్నాయి.మార్కెట్ నిపుణుల ప్రకారం.. నిఫ్టీకి 24,050 స్థాయి కీలక నిరోధంగా ఉండగా, 23,920 వద్ద సమీప మద్దతు ఉంది. 24,050 స్థాయిని దాటితే 24,500 దిశగా కదిలే అవకాశం ఉందని, దిగువన 23,800 వద్ద మరో కీలక మద్దతు ఉన్నట్లు విశ్లేషించారు. దిగుమతి వస్తువుల ధరలు తగ్గడం, బ్యాంకుల నుంచి డాలర్ల సరఫరా కొనసాగడంతో రూపాయి వరుసగా మూడో రోజు బలపడింది.

# బిజినెస్

# 'పేటీఎం పేమెంట్స్ బ్యాంక్' ఇక పూర్తిగా బంద్.. మూసివేతకు ఢిల్లీ హైకోర్టు ఆదేశాలు

-పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ లిక్విడేషన్ ప్రారంభం
-గిరికుమార్ ఎం. నాయర్ లిక్విడేటర్‌గా నియామకం
-జులై 8 నుంచే బోర్డు అధికారాల బదిలీ
-ఏప్రిల్‌లోనే లైసెన్స్ రద్దు చేసిన ఆర్‌బీఐ
-డిపాజిటర్ల ప్రయోజనాల రక్షణే ప్రధాన కారణం

'పేటీఎం పేమెంట్స్ బ్యాంక్'కు అధికారికంగా ముగింపు పలికే ప్రక్రియ మొదలైంది. నిబంధనల ఉల్లంఘనలపై భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) ఇప్పటికే బ్యాంకింగ్ లైసెన్స్‌ను రద్దు చేయగా, ఇప్పుడు ఆ బ్యాంక్‌ను పూర్తిగా మూసివేసే దిశగా మరో కీలక అడుగు పడింది. ఢిల్లీ హైకోర్టు 'పేటీఎం పేమెంట్స్ బ్యాంక్'ను లిక్విడేషన్‌కు పంపాలని ఆదేశించింది. దీంతో బ్యాంక్ వ్యవహారాలన్నీ ఇక అధికారిక లిక్విడేటర్ ఆధ్వర్యంలో కొనసాగనున్నాయి. ఆర్‌బీఐ మంగళవారం విడుదల చేసిన ప్రకటన ప్రకారం.. జులై 8, జులై 22 తేదీల్లో ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల మేరకు పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌ను బ్యాంకింగ్ రెగ్యులేషన్ చట్టం-1949, కంపెనీల చట్టం-2013 నిబంధనల కింద మూసివేయాలని ఆదేశించింది. కోర్టు నిర్ణయంతో బ్యాంక్ లిక్విడేషన్ ప్రక్రియ అధికారికంగా ప్రారంభమైంది. బ్యాంక్‌కు సంబంధించిన పరిపాలనా బాధ్యతలన్నీ ఇక లిక్విడేటర్ చేతుల్లోకి వెళ్లాయి. ఈ ప్రక్రియను పర్యవేక్షించేందుకు 'స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా' మాజీ చీఫ్ జనరల్ మేనేజర్ గిరికుమార్ ఎం. నాయర్‌ను అధికారిక లిక్విడేటర్‌గా హైకోర్టు నియమించింది. బ్యాంకింగ్ రెగ్యులేషన్ చట్టంతో పాటు కంపెనీల చట్టం కల్పించిన అధికారాలన్నీ ఆయన వినియోగించుకోనున్నారు. జులై 8 నుంచే పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ డైరెక్టర్ల బోర్డుకు ఉన్న అధికారాలన్నీ లిక్విడేటర్‌కు బదిలీ అయినట్లు ఆర్‌బీఐ వెల్లడించింది. పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌పై గత కొంతకాలంగా ఆర్‌బీఐ పలు నియంత్రణ చర్యలు తీసుకుంది. పదే పదే నిబంధనలను ఉల్లంఘించడం, నియంత్రణ ప్రమాణాలను పాటించకపోవడాన్ని తీవ్రంగా పరిగణించింది. డిపాజిటర్ల ప్రయోజనాలకు భంగం కలిగే విధంగా బ్యాంక్ వ్యవహారాలు సాగుతున్నాయని నిర్ధారించిన ఆర్‌బీఐ, ఈ ఏడాది ఏప్రిల్‌లో బ్యాంకింగ్ లైసెన్స్‌ను రద్దు చేసింది. అదే సమయంలో బ్యాంక్‌ను మూసివేయాలంటూ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయిస్తామని ప్రకటించింది. తాజా ఉత్తర్వులతో ఆ ప్రక్రియకు న్యాయపరమైన ముద్ర పడింది. ఇకపై పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌కు సంబంధించిన ఆస్తులు, బాధ్యతలు, చట్టపరమైన వ్యవహారాలన్నీ అధికారిక లిక్విడేటర్ పర్యవేక్షణలో సాగనున్నాయి. బ్యాంక్ మూసివేత ప్రక్రియను చట్టబద్ధంగా పూర్తి చేసే బాధ్యత కూడా ఆయనదే. ఈ పరిణామంతో పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ కార్యకలాపాలకు పూర్తిస్థాయిలో ముగింపు పలికినట్లయింది.




# టీమిండియాలో కొత్త ముఖం.. వయసు 33.. ఎవరీ సారాంశ్ జైన్



-33 ఏళ్ల వయసులో తొలిసారి భారత టెస్టు జట్టుకు ఎంపికైన సారాంశ్ జైన్
-శ్రీలంకతో జరగబోయే టెస్టు సిరీస్‌కు సెలక్టర్ల నుంచి పిలుపు
-దేశవాళీ క్రికెట్‌లో నిలకడైన ప్రదర్శనతో గుర్తింపు
-వాషింగ్టన్ సుందర్ గాయపడటంతో దక్కిన అరుదైన అవకాశం
-తుది జట్టులో చోటు కోసం మానవ్ సుతార్‌తో తీవ్ర పోటీ

భారత క్రికెట్‌లో పట్టుదల, నిరంతర శ్రమకు ఫలితం ఎప్పటికైనా దక్కుతుందని మరోసారి రుజువైంది. దాదాపు దశాబ్ద కాలంగా దేశవాళీ క్రికెట్‌లో రాణిస్తున్నా గుర్తింపునకు నోచుకోని మధ్యప్రదేశ్ ఆల్ రౌండర్ సారాంశ్ జైన్, ఎట్టకేలకు 33 ఏళ్ల వయసులో తొలిసారి భారత టెస్టు జట్టు నుంచి పిలుపు అందుకున్నాడు. ఆగస్టులో శ్రీలంకతో జరగనున్న రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ కోసం ఎంపిక చేసిన జట్టులో సెలక్టర్లు అతనికి చోటు కల్పించారు. ఎడమచేతి వాటం బ్యాటింగ్, కుడిచేతి వాటం ఆఫ్ స్పిన్ బౌలింగ్ చేసే సారాంశ్, టీమిండియా వెటరన్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్‌ను తన ఆరాధ్యుడిగా భావిస్తాడు.

**ఎవరీ సారాంశ్ జైన్?**

మధ్యప్రదేశ్‌కు చెందిన సారాంశ్ జైన్ తండ్రి సుబోధ్ జైన్ కూడా మాజీ ఫస్ట్-క్లాస్ క్రికెటర్. తండ్రి స్ఫూర్తితో క్రికెట్‌లోకి అడుగుపెట్టిన సారాంశ్, 2014లోనే రంజీ ట్రోఫీలో అరంగేట్రం చేశాడు. అయితే, సుదీర్ఘకాలం పాటు జట్టులో స్థానం కోసం పోరాడాల్సి వచ్చింది. 2022 వరకు కేవలం 8 ఫస్ట్-క్లాస్ మ్యాచ్‌లు మాత్రమే ఆడిన అతను, ఆ ఏడాది మధ్యప్రదేశ్ జట్టు తొలిసారి రంజీ ట్రోఫీ గెలవడంలో కీలక పాత్ర పోషించి వెలుగులోకి వచ్చాడు. నాకౌట్ దశలో 13 వికెట్లు పడగొట్టడమే కాకుండా, ఒక అర్ధ సెంచరీతో జట్టు విజయంలో తన వంతు సహకారం అందించాడు. ఇక గతేడాది రంజీ సీజన్ అయితే అతని కెరీర్‌లోనే అత్యుత్తమంగా నిలిచింది. బ్యాటింగ్‌లో 57.55 సగటుతో 518 పరుగులు, బౌలింగ్‌లో 20.43 సగటుతో 30 వికెట్లు తీసి ఆల్ రౌండర్‌గా అద్భుత ప్రదర్శన కనబరిచాడు. దీనికి ముందు జరిగిన దులీప్ ట్రోఫీలో సెంట్రల్ జోన్ తరఫున కేవలం రెండు మ్యాచ్‌లలో 16 వికెట్లు, రెండు అర్ధ సెంచరీలు సాధించి "ప్లేయర్ ఆఫ్ ది సిరీస్" అవార్డును గెలుచుకున్నాడు. సారాంశ్ గత నెలలో ఆఫ్ఘనిస్థాన్‌తో జరిగిన ఏకైక టెస్టుకు నెట్ బౌలర్‌గా కూడా సేవలందించాడు.

**సెలక్షన్‌కు కారణం ఇదే**

రెగ్యులర్ స్పిన్నర్ వాషింగ్టన్ సుందర్ తొడ కండరాల గాయంతో తొలి టెస్టుకు దూరం కావడంతో సెలక్టర్లు ప్రత్యామ్నాయం కోసం అన్వేషించారు. శ్రీలంక జట్టులో ఎడమచేతి వాటం బ్యాటర్లు ఎక్కువగా ఉండటంతో, ఒక ఆఫ్ స్పిన్నర్ అవసరాన్ని గుర్తించారు. అదే సమయంలో సారాంశ్ జైన్ ఇటీవలే ఇండియా-ఏ జట్టుతో కలిసి శ్రీలంకలో పర్యటించాడు. అక్కడ తొలి మ్యాచ్‌లో సాధారణంగా రాణించినా, రెండో మ్యాచ్‌లో అజేయంగా 70 పరుగులు చేసి, 6 వికెట్లు పడగొట్టి తన ఎంపికకు మార్గం సుగమం చేసుకున్నాడు. ఈ ప్రదర్శనతో సెలక్టర్ల దృష్టిని బలంగా ఆకర్షించి, జాతీయ జట్టులో స్థానం దక్కించుకున్నాడు.

**అరంగేట్రం చేసే అవకాశాలు**

శ్రీలంక పిచ్‌లపై ముగ్గురు స్పిన్నర్లతో బరిలోకి దిగాలని భారత జట్టు యాజమాన్యం భావిస్తోంది. రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్ తుది జట్టులో ఉండటం దాదాపు ఖాయం. మూడో స్పిన్నర్ స్థానం కోసం సారాంశ్ జైన్, యువ స్పిన్నర్ మానవ్ సుతార్ మధ్య పోటీ నెలకొంది. ఆఫ్ఘనిస్థాన్‌పై అరంగేట్రంలోనే 7 వికెట్లు తీసి సుతార్ ఆకట్టుకున్నాడు. అయితే, జట్టులో ఇప్పటికే జడేజా రూపంలో ఒక లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ ఉన్నందున, మరొకరిని ఆడించేందుకు యాజమాన్యం మొగ్గు చూపకపోవచ్చు. శ్రీలంక బ్యాటింగ్ లైనప్‌లో ఎడమచేతి వాటం బ్యాటర్లు ఎక్కువగా ఉండటం సారాంశ్ కు కలిసొచ్చే అంశం. ఒకవేళ అతను తుది జట్టులో చోటు దక్కించుకుంటే, 1998లో రాబిన్ సింగ్ తర్వాత 33 ఏళ్ల వయసు దాటాక టెస్టు అరంగేట్రం చేసిన మరో భారత క్రికెటర్‌గా అరుదైన ఘనత సాధిస్తాడు.

# క్రీడలు

# యువ ఆటగాళ్ల ఆకలే మా బలం.. జింబాబ్వే సిరీస్ విజయం తర్వాత అయ్యర్

-జింబాబ్వేపై భారత్ 3-0తో క్లీన్‌స్వీప్
-యువ ఆటగాళ్లపై అయ్యర్ ప్రశంసలు
-మయాంక్ యాదవ్ ఆటతీరుపై ప్రత్యేక అభినందనలు
-వైభవ్ సూర్యవంశీ ఆరంభాలు కీలకమన్న కెప్టెన్
-ప్రతి ఆటగాడి సహకారమే విజయ రహస్యం

జింబాబ్వేపై టీ20 సిరీస్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేసిన తర్వాత భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ యువ ఆటగాళ్లపై ప్రశంసలు కురిపించాడు. జట్టులో చోటు నిలబెట్టుకోవాలనే తపన, ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనే ఆకలే జట్టు విజయానికి ప్రధాన కారణమని చెప్పాడు. టీ20 కెప్టెన్‌గా తన తొలి సిరీస్ విజయాన్ని అందుకోవడం ఎంతో ప్రత్యేకమైన అనుభూతినిచ్చిందని వెల్లడించాడు. కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఐర్లాండ్‌పై రెండు, ఇంగ్లండ్‌పై నాలుగు మ్యాచ్‌లు వరుసగా ఓడిపోయామని అయ్యర్ గుర్తు చేశాడు. అయితే జింబాబ్వేపై వరుసగా మూడు మ్యాచ్‌లు గెలిచి క్లీన్‌స్వీప్ చేయడం జట్టులో ఆత్మవిశ్వాసాన్ని పెంచిందన్నాడు. ఫలితాల గురించి కాకుండా జట్టుగా ఒక ప్రమాణాన్ని నిర్దేశించుకుని ఆ దిశగా ఆడటంపైనే దృష్టి పెట్టామని వివరించాడు. యువ పేసర్ మయాంక్ యాదవ్‌ను అయ్యర్ ప్రత్యేకంగా ప్రశంసించాడు. మ్యాచ్‌లో ప్రతి బంతికి ముందు ఏం చేయాలని తనను అడిగేవాడని, నిర్ణయించిన ప్రణాళికను అద్భుతంగా అమలు చేశాడని కొనియాడాడు. అతడి వైఖరి, ఆటతీరు ఈ సిరీస్‌లో ప్రత్యేకంగా నిలిచాయని తెలిపాడు. యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ కూడా జట్టుకు అద్భుతమైన ఆరంభాలు అందించాడని అయ్యర్ చెప్పాడు. తొలి రెండు మ్యాచ్‌ల్లో అతడు ఇచ్చిన శుభారంభం జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించిందన్నాడు. ఆ తర్వాత ఇషాన్ కిషన్, తిలక్ వర్మ కూడా తమవంతు బాధ్యతను నిర్వర్తించారని పేర్కొన్నాడు. ప్రతి ఆటగాడు తన పాత్రను సమర్థంగా పోషించినప్పుడే విజయాలు సాధ్యమవుతాయని, జింబాబ్వే సిరీస్‌లో అదే జరిగిందని అయ్యర్ అభిప్రాయపడ్డాడు.




# చిన్న చిన్న ఆశై' (జియో హాట్ స్టార్) మూవీ రివ్యూ!

మధుబాల – ఇంద్రన్స్ ప్రధానమైన పాత్రలను పోషించిన సినిమానే 'చిన్న చిన్న ఆశై'. వర్ష వాసుదేవ్ దర్శకత్వం వహించిన ఈ సినిమా, జూన్ 19వ తేదీన థియేటర్లకు వచ్చింది. ఈ రోజు (జులై 28వ తేదీ) నుంచి తమిళ .. మలయాళ భాషలతో పాటు తెలుగులోనూ ఈ సినిమా అందుబాటులోకి వచ్చింది. గతంలో మధుబాల కథానాయికగా నటించిన 'రోజా' సినిమాలోని పాట నుంచి వచ్చిన టైటిల్ కావడం అందరిలో ఆసక్తిని రేకెత్తించింది.'వారణాసి'లో మాధవన్ మాస్టారు (ఇంద్రన్స్) కూతురు జానకి (అపర్ణ బాలమురళి) చదువుకుంటూ సంప్రదాయ నృత్యాన్ని నేర్చుకుంటూ ఉంటుంది. ఆమెను చూడటం కోసం కేరళ నుంచి అప్పుడప్పుడు అతను వచ్చి వెళుతుంటాడు. అలా వారణాసి వచ్చిన అతనికి, భయంతో ఒంటరిగా మిగిలిపోయిన ఒక మహిళ కనిపిస్తుంది. తన పేరు 'లీల' (మధుబాల) అని ఆమె అతనితో చెబుతుంది. 'తంజావూరు' నుంచి తామంతా ఒక బృందంగా వచ్చినట్టు చెబుతుంది. 'లీల' సెల్ ఫోన్ .. ఆమె 'పర్స్' ను దొంగ కాజేశాడనీ, అతనిని వెంబడించే ప్రయత్నంలో ఆమె తన బృందం నుంచి తప్పిపోయిందని మాధవన్ అర్థం చేసుకుంటాడు. తప్పిపోయినవారి సమాచారాన్ని అందించే కేంద్రంలో 'లీల' పేరు రాయించిన మాధవన్, ఆమె కోసం ఎవరైనా వస్తే తనకి కాల్ చేయమని చెప్పి తన సెల్ నెంబర్ ఇస్తాడు. భయపడవలసిన పనిలేదనీ, తంజావూరు టీమ్ తో కలిసి తిరిగి వెళ్లిపోవచ్చని ఆమెకి మాధవన్ ధైర్యం చెబుతాడు. మొదట్లో కాస్త భయపడినప్పటికీ, ఆ తరువాత ఆమె తన గురించిన వివరాలను అతనికి చెబుతుంది. అతను కూడా తన భార్య తనకి శాశ్వతంగా దూరమైపోయిందంటూ తన కథను వివరిస్తాడు. లీలకి వారణాసి చూడాలని ఉందని తెలుసుకున్న మాధవన్, ఆమెను వెంటబెట్టుకుని ఆ చుట్టుపక్కల ప్రదేశాలు చూపిస్తాడు. ఆ సమయంలో వారికి ఎలాంటి అనుభవాలు ఎదురవుతాయి? ఆ పరిచయం వారి జీవితాలను ఎలా ప్రభావితం చేస్తుంది? అనేది మిగతా కథ. జీవితం సమస్యలతో సతమతం చేసినప్పుడు .. విధి ఒంటరిని చేసి నిలబెట్టినప్పుడు ఆ మనసు ప్రశాంతతను కోరుకుంటుంది. స్వచ్ఛమైన మరో మనసు తోడును కోరుకుంటుంది. అలాంటి తోడు దొరికినప్పుడు ప్రతి చిన్న సంఘటన ఒక అందమైన జ్ఞాపకంగా మారిపోతూ ఉంటుంది .. గుండె గదులను అనుభూతిగా హత్తుకుపోతూ ఉంటుంది. అలాంటి రెండు ఒంటరి మనుషుల కథ ఇది .. ఒంటరి మనసుల కథ ఇది. జీవితం ఒక మోడుగా మారిపోయిందని నిరాశపడిపోయిన 'లీల' .. ఒంటరి తనాన్ని మరిచిపోవడం కోసం ఆనందాన్ని వెతుక్కునే మాధవన్, 'వారణాసి'లో అనుకోకుండా కలుసుకుంటారు. వేదాంతం .. వైరాగ్యం అడగకుండానే అనుభవంలోకి వచ్చే దృశ్యాల మధ్య, జీవితం చేసిన గాయాలను వాళ్లిద్దరూ పంచుకుంటారు. చిన్న చిన్న ఆశలను నెరవేర్చుకోవడానికి పెద్దగా సమయాన్ని కేటాయించవలసిన పనిలేదని భావించే ఇద్దరు మనుషుల చుట్టూ దర్శకుడు ఈ కథను అల్లుకున్నాడు. వారణాసిలో .. ఒకే ఒక రోజులో జరిగే పరిచయం రెండు మనసులను ఎంతగా ప్రభావితం చేస్తుంది .. ఎంతగా ఊరట కలిగిస్తుందనేది దర్శకుడు ఆవిష్కరిస్తూ వెళ్లిన తీరు ఆకట్టుకుంటుంది. అయితే ఫీల్ కోసం కేటాయించిన సమయం, ఆడియన్స్ కి సాగతీతగా అనిపిస్తుంది. సన్నివేశాలు మరీ నిదానంగా సాగుతున్న భావన కలుగుతుంది. చివర్లో వచ్చే ట్విస్ట్ మనసును తాకుతుంది. ఇంద్రన్స్ నటనకు వంకబెట్టవలసిన పనిలేదు. ఇక మధుబాల దగ్గరికి వచ్చేసరికి, ఆమె పాత్రను డిజైన్ చేసిన తీరు కాస్త అయోమయంలో పడేస్తుంది. ఆమె ఎక్స్ ప్రెషన్స్ లోని ఆంతర్యం ఏమిటనే కన్ఫ్యూజన్ ప్రేక్షకులకు ఉండిపోతుంది. ప్రధానమైన పాత్రలకు తారసపడే రెండు మూడు పాత్రలు కూడా విషయం లేనివిగానే అనిపిస్తాయి. అపర్ణ బాలమురళి పై చిత్రీకరించిన పాట ప్రత్యేక ఆకర్షణగా చెప్పుకోవచ్చు. ఫొటోగ్రఫీ .. నేపథ్య సంగీతం .. ఎడిటింగ్ ఫరవాలేదనిపిస్తాయి. జీవితంలో ఓడిపోయినప్పుడు .. ఒంటరిగా మిగిలిపోయినప్పుడు ప్రతి మనసు ఒక తోడును కోరుకుంటుంది. అలాంటి ఒక పరిచయం జరిగితే అది శాశ్వతంగా నిలిచిపోవాలని ఆశపడుతుంది. కరిగే కాలం ఆ కోరికను మన్నిస్తుందా? లేదా? అనే ఒక సందేహానికి సమాధానంగా ఈ కథ నడుస్తుంది. ఫీల్ ఉన్నప్పటికీ .. కథనం మరీ నిదానించినట్టుగా అనిపిస్తుంది.













# శ్రీనివాస మంగాపురం' రన్ టైమ్ ఇదే!

**'-శ్రీనివాస మంగాపురం' సినిమా రన్‌టైమ్ ఖరారు**

**-మొత్తం 2 గంటల 35 నిమిషాల నిడివితో చిత్రం**

**-అజయ్ భూపతి దర్శకత్వంలో వస్తున్న ఇంటెన్స్ లవ్ స్టోరీ**

**-ఘట్టమనేని జైకృష్ణ హీరోగా పరిచయం**

జూలై 30న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల ఒక సినిమా కథలో దర్శకుడికి ఎంత నమ్మకం, స్పష్టత ఉన్నాయో చెప్పడానికి ఆ చిత్ర నిడివి కూడా ఒక నిదర్శనంగా నిలుస్తుంది. తాజాగా, దర్శకుడు అజయ్ భూపతి తన కొత్త చిత్రం 'శ్రీనివాస మంగాపురం' రన్‌టైమ్‌ను అధికారికంగా ప్రకటించారు. ఈ సినిమా 2 గంటల 35 నిమిషాల నిడివితో ప్రేక్షకులను పలకరించనుంది. "సీజన్‌లోనే అత్యంత గాఢమైన ప్రేమకథ" అని ప్రచారం చేస్తున్న ఈ చిత్రానికి ఇంత నిడివిని లాక్ చేయడం, కథపై యూనిట్‌కు ఉన్న గట్టి నమ్మకాన్ని తెలియజేస్తోందని ఇండస్ట్రీ వర్గాలు భావిస్తున్నాయి.' చిత్రంతో టాలీవుడ్‌లో సంచలనం సృష్టించి, తనకంటూ ఒక ప్రత్యేకమైన బ్రాండ్ క్రియేట్ చేసుకున్న దర్శకుడు అజయ్ భూపతి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఆయన చిత్రాలంటేనే రా, రస్టిక్ భావోద్వేగాలకు పెట్టింది పేరు. ఇప్పుడు పూర్తిస్థాయి ప్రేమకథతో వస్తుండటంతో సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. ఈ చిత్రంతో ఘట్టమనేని కుటుంబం నుంచి జైకృష్ణ హీరోగా తెలుగు తెరకు పరిచయం కానుండటం మరో ప్రధాన ఆకర్షణ. ఇదే సినిమాతో బాలీవుడ్ భామ రవీనా టాండన్ కుమార్తె రాషా థడానీ కూడా టాలీవుడ్ అరంగేట్రం చేస్తోంది. ఇప్పటికే విడుదలైన అప్‌డేట్స్ ద్వారా జయకృష్ణ ఘట్టమనేని, రాషా కెమిస్ట్రీ అందరినీ ఆకట్టుకుంటోంది. ఇందులో సీనియర్ నటుడు మోహన్ బాబు పవర్ ఫుల్ రోల్ లో కనిపించనున్నారు. టాలీవుడ్ లెజెండరీ నిర్మాత, వైజయంతీ మూవీస్ అధినేత సి. అశ్వనీదత్ ఈ చిత్రాన్ని సమర్పిస్తుండటం సినిమా స్థాయిని పెంచుతోంది. చందమామ కథలు పిక్చర్స్ ఎల్ఎల్‌పి పతాకంపై పి. కిరణ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. భావోద్వేగభరితమైన కథలకు తన సంగీతంతో ప్రాణం పోసే ప్రముఖ సంగీత దర్శకుడు జి.వి. ప్రకాశ్ కుమార్ ఈ సినిమాకు స్వరాలు సమకూర్చారు. అజయ్ భూపతి మార్క్ టేకింగ్, ఘట్టమనేని వారసుడి అరంగేట్రం, అశ్వనీదత్ సమర్పణ వంటి బలమైన అంశాలతో వస్తున్న 'శ్రీనివాస మంగాపురం' చిత్రాన్ని జూలై 30న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.




Publisher: AKULA SWATHI , printed at SUNDAY PRINTING PRESS, FLAT. NO.363B,1st FLOOR,MADHAVARAM NAGAR COLONY ,RANGAREDDY, TELANGANA - 500072 .
Published at H.NO.15-56/1, Village & Mandal CHERIAL , SIDDIPET District ,Telangana state - 506223, Editor :THADEM PRASHANTH Cell :9000306455